సాక్షి మంచిర్యాల

గురువారం । 14 । మార్చి । 2024

ఎంఎల్‌హెచ్‌పీల ఎంపిక జాబితా

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితాను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధికారిక వెబ్‌సైట్ www.mancherial.telangana.gov.inలోనూ జాబితా ఉంచామని, ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:27	శుక్ర: 5:03

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0 /24.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఈశాన్యం దిశగా గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

16నుంచి ఇంటర్ మూల్యాంకనం

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షల మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 16నుంచి మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఇంటర్ బోర్డు నుంచి నియామక పత్రాలు వచ్చిన వారు విధుల్లో చేరాలని ఇదివరకే జిల్లా ఇంటర్ విద్యాధికారి శైలజ స్పష్టం చేశారు. మొత్తం మూడు విడతల్లో పూర్తి చేయనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం సమాధాన పత్రాలు ఇప్పటికే కేంద్రానికి చేరుకున్నాయి. మొదటి విడత ఈ నెల 16న ఇంగ్లిష్, తెలుగు, హిందీ, గణితం(ఏ, బీ), పొలిటికల్ సైన్స్, రెండో విడత 20న ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకానమిక్స్, కామర్స్, మూడో విడత ఈ నెల 24న బోటనీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించి మూల్యాంకనం చేపట్టనున్నారు. జవాబు పత్రాలు ఎన్ని కేటాయించనున్నారనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. కేంద్రం వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. అవకతవకలు జరగకుండా సీసీ కెమెరాలు బిగించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ పార్లమెంటు



సమావేశంలో విద్యార్థులు

బెల్లంపల్లి: పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యార్థుల నమూనా పార్లమెంటు సమావేశం ఆకట్టుకుంది. పార్లమెంటులో ప్రజాసమస్యలపై సభ్యులు చర్చించే తీరును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నెహ్రూ యువకేంద్ర, సంక్షేమ బాలుర సీఓఈ గురుకుల కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంటు నిర్వహించారు. విద్యార్థులు స్పీకర్, ప్రధానమంత్రి, మంత్రులు, విపక్ష సభ్యులుగా వ్యవహరిస్తూ హిందీ, ఇంగ్లిషు భాషల్లో సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నెహ్రూ యువకేంద్ర యూత్ ఆఫీసర్ సుశీల్ బడ్, సీనియర్ రిసోర్స్ పర్సన్ గజ్జెల్లి మోహన్, జానకి, శోభ, లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, ప్రమోద్‌కుమార్, శ్రీలత, ప్రమోద్, అనిరుద్, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఈవీఎం నిర్వహణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బి.రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: పార్లమెంటు ఎన్నికల సమయంలో జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఈవీఎం, వీవీ ప్యాట్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో వేర్ హౌజ్ సూపర్ వైజర్లు, ఐటీ అధికారులు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు, ఈవీఎం అవగాహన బృందాలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, ఎల్‌ఏ, ఆర్ఆర్ ప్రత్యేక ఉప పాలనాధికారి డి.చంద్రకళతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ అధికారులు ఎన్నికలకు సంబంధించిన ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని అన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ఏర్పాటు, పోలింగ్ రోజు వీటిలో సమస్యలు తలెత్తితే వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు.

పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వివిధ పోటీ పరీక్షల పుస్తకాలు జిల్లాలోని గ్రంథాలయాల్లో పాఠకులకు అందుబాటులో ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఏవీఎస్.రాజుతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో అవసరమైన పుస్తకాల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రూప్ పరీక్షలు, డీఎస్సీ, ఇతర ఉద్యోగాల పోటీ పరీక్షల దృష్ట్యా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, భీమారం గ్రంథాలయాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రంథాలయ అధికారులు ఎస్.మురళి, జి.రమేష్, వి.గోపయ్య, ఏ.స్వరూప, ఎం.మాణిక్యం, సిహెచ్.అనిల్ కుమార్, కె.కృతిన్ పాల్గొన్నారు.

ప్లాట్లు చేయ్.. అమ్మేయ్!



- సర్కారు, అసైన్డ్, వాగు, చెరువుల చెర
- ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్న వెంచర్లు
- నిబంధనలు పాటించని కొందరు రియల్టర్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. వెంచర్లలో క్రయ విక్రయాలు చేస్తున్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టణాలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారుల వెంట ప్రతీచోటా వెంచర్లు వెలుస్తున్నాయి. జిల్లా కేంద్రం గర్మిళ్ల, మంచిర్యాల పట్టణ పరిధి, హాజీపూర్ మండలం వేంపల్లి, ముల్కల, గుడిపేట పరిసర ప్రాంతాలు, గద్దెరాగిడి, లక్సెట్టిపేట మండల శివారు గ్రామాలు, జైపూర్, మందమర్రి, చెన్నూర్, బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాల్లో అధికంగా రియల్ వ్యాపారం సాగుతోంది. ఎక్కువగా రాజకీయ నాయకులే భూ దందాల్లో ఉండడంతో కఠిన చర్యలు కరువవుతున్నాయి.

వనాల పేరుతో..

జైపూర్ మండలంలో నర్వా, దుబ్బపల్లి, రామారావుపేట్, రసూల్‌పల్లి చుట్టుపక్కల గ్రామాల్లో సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు చుట్టూ అనేక వెంచర్లు వెలిశాయి. చాలావాటికి కనీస అనుమతులు లేవు. ఫాం ల్యాండ్స్, వనాలు పెంచుతామంటూ ప్లాట్లు అమ్మేస్తున్నారు. ఈ తరహావి హాజీపూర్, లక్సెట్టిపేట, మందమర్రి మండల పరిధిలోనూ ఫాం ల్యాండ్స్ గుంటల చొప్పున తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

- మందమర్రి మండలం మేడారం, అందుగులపేట జాతీయ రహదారి వెంట వెంచర్లు వెలిశాయి. కాసిపేట మండలం పెద్దనపల్లి శివారు సర్కారు భూమి, ఆకెనపల్లి గ్రామ శివారులో 3పైకి సర్వే నంబరులోని అసైన్డ్ భూముల్లోనూ అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపట్టడంతో ఫిర్యాదులు వెల్లువెత్తడంతో నిలిచిపోయాయి.
- లక్సెట్టిపేట మండలం శాంతాపూర్‌లో లక్ష్మీపూర్, పోతేపల్లి శివార్లలో 30ఎకరాల్లో మెగా టౌన్‌షిప్ ఏర్పాటు చేశారు. దీనికి పూర్తి స్థాయిలో అనుమతులు లేకుండా ప్లాట్లు అమ్మకానికి పెట్టారు.

సర్కారు భూమి ఆక్రమించి..

ఇది రాజీవ్‌నగర్ పరిధిలో ఓ మాజీ సైనికుడికి 345/5లో నాలుగు ఎకరాలు సర్కారు అసైన్డ్ చేసింది. సాగు కోసం ఇచ్చిన భూమిని, పట్టణ విస్తరణతో అనధికారికంగా వెంచర్ వేసి ప్లాట్లు చేసి అమ్మేశారు. ఇప్పటికే 14ప్లాట్లు 23686చ.గజాలు అమ్మేశారు. అమ్మిన భూమికి, అతని పేరుతో ఉన్న పట్టా భూమికి మరో 35గుంటలు అధికంగా విక్రయించారు. అంతేకాక ప్లాట్లకు రోడ్ల కోసం మరో 35గుంటల సర్కారు భూమిని ఆక్రమించారు. సైనికుడి భార్య స్థానికంగా ఉన్న కొందరికీ భూ క్రయవిక్రయాలు చేశారు. ఇటీవల దీనిపై అధికారులకు ఫిర్యాదులు సైతం వెళ్లాయి. రాజీవ్‌నగర్ ప్రాంతంలో సర్కారు భూములు యథేచ్ఛగా కబ్జాలకు గురవుతూనే ఉన్నాయి.

వాగులోనే..



ఇది రామక్రిష్టాపూర్ పట్టణ పరిధిలోని తిమ్మాపూర్‌లో 50, 51 సర్వేనంబరులో రాళ్ల వాగు ఒడ్డునే ఏర్పాటు చేసిన వెంచర్. వాగు కనీస బఫర్ జోన్ కూడా వదలకుండా వాగులోనే గోడ కట్టేసి, ప్లాట్లు చేసి అమ్ముతున్నారు. ఒకే సర్వే నంబరుగా చూపిస్తూ అమ్మేస్తున్నారు. వాస్తవ పట్టాదారుల వారసుల వివాదం ఉన్నప్పటికీ కొనుగోలుదార్లను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇదే తీరుగా బొక్కలగుట్ట, ఏసీసీ క్వారీ రోడ్డు, కార్మెల్ స్కూల్, పాత మంచిర్యాల బ్రిడ్జి వరకు ఇరువైపులా కోర్, బఫర్ ప్రాంతం తేడా లేకుండా చదును చేస్తూ ప్లాట్లు చేసి అమ్ముతున్నారు. రెవెన్యూ, సాగునీటి శాఖ అధికారులు పట్టించుకోక వాగు ఆక్రమణ చెరల నుంచి కాపాడడంలో విఫలమవుతున్నారు. వాగుకు ఇరువైపుల ఆక్రమణలతో వరదల సమయంలో మంచిర్యాల పట్టణానికి ముంపు ఏర్పడుతోంది.

చెరువు పక్కనే..



ఇది నస్పూర్ ఊర చెరువు 45సర్వే నంబరు పరిధిలో వెలిసిన వెంచర్. చెరువుకు ఆనుకునే ప్లాట్లు చేసి అమ్ముతున్నారు. మొదట స్థానిక మున్సిపల్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో రిజిస్ట్రేషన్లు చేయలేదు. తర్వాత రాజకీయ పలుకుబడితో యథావిధిగా ప్లాట్లు అమ్మేస్తున్నారు. ఎఫ్‌టీఎల్(గరిష్ట చెరువు మట్టం) పరిధిలోనే ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు జరిపిస్తున్నారు. ఈ మున్సిపాలిటీ పరిధిలో కేవలం ఐదింటికే అనుమతులు ఉండగా, మిగతా వాటికి ఏ వెంచర్‌కు అనుమతులు లేవు.

హద్దు దాటి..



ఇది జిల్లా కేంద్రంలోనిది. శ్రీనివాస కాలనీ సర్వేనంబరు 324లో అసైన్డ్ భూములు ఉన్నాయి. మిగిలిన సర్కారు భూమితోపాటు అమరవాది నుంచి వచ్చి, రాళ్లవాగులో కలిసే మిగిలిన(ఒర్రె) వాగు పరిసర ప్రాంతాల్లో విపరీతంగా ఆక్రమణలు జరుగుతున్నాయి. రైల్వే ట్రాక్ వరకు ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారు. హద్దు రాళ్లు సైతం తొలగించారు. వాగుకు ఇరువైపుల ప్లాట్లు ఉండడంతో వాగు దాటేందుకు ఏకంగా ఓ బ్రిడ్జినే కట్టేందుకు రియల్ వ్యాపారులు సిద్ధమయ్యారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్
- ఎన్నికల ప్రక్రియపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బీ.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని నోడల్ అధికారులు పార్లమెంటు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, ఏసీపీ ప్రకాష్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణలతో కలిసి నోడల్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలైన్స్, వీడియో సర్వేలైన్స్, వీడియో పరిశీలన, సహాయ ఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, కంట్రోల్ రూమ్, ఖర్చుల పర్యవేక్షణ కమిటీలు నియమించామని తెలిపారు. ఈవీఎం నిర్వహణలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్ల లభ్యత, పంపిణీ, మొదటి స్థాయి తనిఖీ, ర్యాండమైజేషన్ వంటి కార్యకలాపాల కోసం కార్యాచరణ రూపకల్పన చేస్తామని తెలిపారు.

వార్షిక రుణ లక్ష్యాన్ని సాధించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా వార్షిక రుణ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏజీఎం ఎండీ.రైమన్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏజీఎం సురేష్, బ్యాంకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లా రుణ లక్ష్యం రూ.4,625కోట్లుగా నిర్దేశించినట్లు తెలిపారు. లక్ష్యం మేరకు అన్ని బ్యాంకుల అధికారుల ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సర పరీక్షలు బుధవారం ముగిశాయి. 7,115 మంది విద్యార్థులకు 6,629 మంది హాజరుకాగా 486 మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 6,120మందికి 5,722 మంది హాజరుకాగా 398 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 995 మందికి 907 మంది హాజరు కాగా 88 మంది రాలేదు.

కిడ్నీలు జరభద్రం



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో రోగులు

- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుతో ఊరట
- జిల్లాలో లేని నెఫ్రాలజిస్టు వైద్యులు
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం

మంచిర్యాలటౌన్: అవసరానికి మించి యాంటీబయాటిక్స్, పెయిన్‌కిల్లర్స్ వాడడం, హైబీపీ, మధుమేహం, మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు మూత్రపిండాల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఫలితంగా పలువురికి కిడ్నీ సంబంధిత సమస్యలు ఎదురవుతాయి. శరీరంలోని మలినాలను బయటకు పంపించడంలో కిడ్నీలు కీలకపాత్ర పోషిస్తాయి. రక్తాన్ని శుద్ధి చేయడం ద్వారా ఒంట్లో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపుతాయి. మధుమేహం, హైబీపీ వంటి వ్యాధుల కారణంగా కిడ్నీల పనితీరు మందగిస్తుంది. కిడ్నీలు పూర్తిగా పాడైతే ప్రాణాలు దక్కకుండా పోతాయి. ప్రాథమిక దశలోనే కిడ్నీల సమస్యను గుర్తించి సరైన చికిత్స తీసుకోవాలి. జిల్లాలో కిడ్నీ వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతో రోజుకు 50 మందికి పైగా, నెలకు వెయ్యికి పైగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో మూడు డయాలసిస్ కేంద్రాలు

జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ చేసేందుకు మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 10 పడకలతో కూడిన డయాలసిస్ కేంద్రం ఉండగా, ప్రతీరోజు 30 మందికి, నెలకు 900 మందికి డయాలసిస్ చేస్తున్నారు. ఇప్పటివరకు 6,163 డయాలసిస్‌లు చేయగా, బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిలో 5 పడకలతో డయాలసిస్ కేంద్రం ఉండగా, 2,152 డయాలసిస్‌లు చేశారు. చెన్నూరు ఏరియా ఆస్పత్రిలో 5 బెడ్‌లతో డయాలసిస్ కేంద్రం ఈ ఏడాది జనవరిలో ఏర్పాటు చేయగా 213 డయాలసిస్‌లు చేశారు. గతంలో మంచిర్యాలలో ఐదు బెడ్‌లతో డయాలసిస్ కేంద్రాన్ని నిర్వహించిన సమయంలో వ్యాధిగ్రస్తులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మరో ఐదు బెడ్‌లను కలిపి డయాలసిస్ కేంద్రం సామర్థ్యం పెంచడంతో కొంత ఊరట లభించింది. గత ఏడాది జనవరిలో బెల్లంపల్లిలో, ఈ ఏడాది జనవరిలో చెన్నూరులో ఐదు బెడ్‌ల చొప్పున డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుతో వ్యాధిగ్రస్తులకు ఇబ్బంది తొలగి ఎక్కడి వారు అక్కడే డయాలసిస్ చేసుకోవడంతో ప్రయాణ భారం తప్పింది. జిల్లా మొత్తంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులను పరీక్షించే నెఫ్రాలజిస్టు వైద్యులు లేకపోవడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ నెఫ్రాలజిస్టులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఇక్కడి వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్నారు. జనరల్ ఫిజీషియన్ వైద్యులతోనే సరిపెడుతుండగా, ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరు చేసినా నెఫ్రాలజిస్టుల నియామకం చేపట్టకపోవడంతో వ్యాధిగ్రస్తులకు శాపంగా మారుతోంది.

మరో టెక్నీషియన్ అవసరం



చెన్నూర్‌లో రోగులకు సేవలు

చెన్నూర్: చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 20 మంది కిడ్నీ రోగులు ఉన్నారు. రెండ్రోజులకోసారి డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. రెండు షిఫ్టులుగా డయాలసిస్ చేస్తున్నారు. రోగుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో మరో షిఫ్టు పెంచాలని, మరో ఐదు పడకలతోపాటు టెక్నీషియన్ నియమించాలని రోగులు కోరుతున్నారు.

మేలు జరిగింది



గతంలో కిడ్నీ బాధితులు పట్టణ ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా మెయింటనెన్స్ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో పేద రోగులకు రవాణా భారంతోపాటు ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి. రెండు షిఫ్టులలో డయాలసిస్ సేవలు అందిస్తున్నాం.

– డి.సత్యనారాయణ, చెన్నూర్ సూపరింటెండెంట్

పరీక్షలు చేసుకోవాలి



మధుమేహం, అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోలేని వారు, చెట్ల మందులను వాడేవారు, నొప్పికి సంబంధించిన ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లను తీసుకునే వారు, తాగునీటిని సక్రమంగా తీసుకోని వారికి కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఆహారపు అలవాట్లను మార్చుకుని, జంక్‌ఫుడ్ వంటి వాటికి దూరంగా ఉండడం, ధూమపానం చేయకపోవడం, హైప్రోటీన్ పౌడర్‌ను తీసుకోకుండా ఉండాలి. కిడ్నీ పని తీరును తెలుసుకునేందుకు క్రియాటినిన్ పరీక్షలు చేసుకుని, కిడ్నీ సమస్య ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించి మందులు వాడితే పరిస్థితి అదుపులో ఉంటుంది.

– డాక్టర్ అతుల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి

'కమలం' అభ్యర్థిగా 'గోమాసే'

- పెద్దపల్లి ఎంపీ పోటీకి దక్కిన అవకాశం
- కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన నాయకుడు



గోమాసే శ్రీనివాస్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భారతీయ జనతా పార్టీ నుంచి పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థిగా గోమాసే శ్రీనివాస్‌ను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. బుధవారం ఆ పార్టీ విడుదల చేసిన రెండో జాబితాలో ఆయన పేరు వెల్లడైంది. గత కొంత కాలంగా పెద్దపల్లి స్థానం నుంచి ఎవరిని బరిలోకి దింపాలనే అనేక పరిశీలనలు, వడపోతలు పూర్తయ్యాక చివరకు ఆ అదృష్టం 'గోమాసే'కు దక్కింది. ఇటీవలే ఆయన కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరగా, తమ అభ్యర్థిగా గుర్తించింది. జిల్లాలో మొదటి నుంచి పలువురి పేర్లు వినిపించినా చివరకు అనూహ్యంగా 'గోమాసే' పేరు ప్రకటించింది.

నేతకాని, పోటీ అనుభవం

కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్న 'గోమాసే' సామాజికవర్గం ఎస్సీల్లో మహర్ నేతకాని సామాజికవర్గంతోపాటు రాజకీయ అనుభవమే ఎంపీ టికెట్ దక్కడంలో కీలకంగా మారింది. రాజకీయాల్లో మక్కువతో 1982–92 మధ్య విద్యార్థి నాయకుడిగా, 1993నుంచి 2003వరకు ఎన్ఎస్‌యూఐలో పని చేశారు. 2004నుంచే ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. తర్వాత టీఆర్ఎస్‌లో చేరి, 2009లో పెద్దపల్లి స్థానం నుంచి పోటీ చేయగా, అప్పట్లో గడ్డం వివేక్ చేతిలో ఓడిపోయారు. తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు ఎమ్మెల్యే టికెట్ ఆశించినా దక్కలేదు. తాజాగా పెద్దపల్లి టికెట్ తనకు రాదని గ్రహించే పార్టీని వీడారు. బీజేపీలో చేరిన వెంటనే ఆయనకు ఈ అవకాశం వరించింది. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం, ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత సైతం నేతకాని కావడంతో మరోసారి ఆ సామాజిక వర్గం వైపే బీజేపీ అధిష్టానం మొగ్గుచూపిందని పార్టీ నాయకులు అంటున్నారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓబీసీ వర్గాల కోసం పని చేసిన పేరుంది. 2008ఆల్ ఇండియా షెడ్యూల్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ' స్థాపించారు. 2018లో ఛత్తీస్‌గఢ్‌లో ప్రత్యేక టీంకు సమన్వయకర్తగా పని చేశారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, జార్కండ్, కర్ణాటక రాష్ట్రాల్లో పార్టీ పరంగా పని చేశారు. ఆల్ ఇండియా మహర్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉన్నారు. పెద్దపల్లి పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 2.22లక్షల వరకు మహర్ నేతకాని సామాజికవర్గ ఓట్లు ఉన్నట్లుగా చెబుతారు.

అభ్యర్థి ప్రొఫైల్

పూర్తి పేరు	గోమాసే శ్రీనివాస్
వయస్సు	55సంవత్సరాలు
స్వస్థలం	మంచిర్యాల పట్టణం
తల్లిదండ్రులు	మల్లుబాయి, రాజయ్య
విద్యార్హతలు	ఎంఏ, పొలిటికల్ సైన్స్
వృత్తి	వ్యాపారం, వ్యవసాయం, రాజకీయాలు
భార్య	గీత
	ఇద్దరు కూతుళ్లు, కుమారుడు

రాజకీయ హోదా, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ

2009పెద్దపల్లి లోక్‌సభకు పోటీ చేసి ఓటమి

ఆశీస్సులు ఇవ్వాలని కోరుతున్నా

నాకు టికెట్ కేటాయించినందుకు పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా, కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, డీకే.అరుణ ఇతర నాయకత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నన్ను గెలిపించేలా ప్రజలు తమ ఆశీస్సులు ఇవ్వాలని కోరుతున్నా.

– గోమాసే శ్రీనివాస్, బీజేపీ ఎంపీ అభ్యర్థి


బుగ్గ రాజన్న హుండీ లెక్కింపు



హుండీ నగదు లెక్కిస్తున్న సభ్యులు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. ఆలయ ఈవో బాపురెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీదేవి సమక్షంలో ఆదాయాన్ని లెక్కించారు. మూడు రోజుల జాతరలో రూ.11,89,724 ఆదాయం సమకూరింది. దర్శనం టికెట్ల అమ్మకాల ద్వారా రూ.2.46లక్షలు, అభిషేకం రూ.16,800, కల్యాణ కట్నాలు రూ.24,170, బహిరంగవేలం రూ.5,23,500, హుండీ ఆదాయం రూ.3,79,254 వచ్చింది. గత ఏడాది కంటే రూ.90,958 అధికంగా వచ్చింది. జేపీఎస్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు సంతోష్, గోపి, రాజన్న, సిబ్బంది భాను పాల్గొన్నారు.

అంబేద్కర్ చౌరస్తాగా మున్సిపల్ తీర్మానం



మాట్లాడుతున్న చైర్మన్ రావుల ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఐబీ చౌరస్తా పేరును డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చౌరస్తాగా మార్పు చేస్తూ మంచిర్యాల మున్సిపల్ సమావేశం తీర్మానించింది. బుధవారం మున్సిపల్ అత్యవసర సమావేశం చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, కమిషనర్ మారుతిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 41 అంశాలను ఆమోదించారు. లక్ష్మీ టాకీస్ చౌరస్తా నుంచి హైటెక్‌సిటీ మీదుగా రైల్వే ట్రాక్‌పై వంతెన నిర్మాణం, చెన్నూరు నేషనల్ హైవే రోడ్డు ఎన్‌హెచ్-63 వరకు 100 ఫీట్ల రోడ్డు డెవలప్‌మెంట్ చేసి ఇచ్చేందుకు ఆర్అండ్‌బీకి అప్పగించారు. ప్రభుత్వ మాతాశిశు ఆసుపత్రిని ఐబీ చౌరస్తాలోని స్థలంలో నిర్మాణానికి ఆమోదం తెలిపారు. మేనేజర్ కె.విజయ్‌కుమార్, ఇంజనీర్ పి.మధుకర్, ఆర్‌వో కె.శ్రీనివాసరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ ఆర్.సునిల్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భీమారం: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్ల శ్రావణ్‌కి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మంచిర్యాల నుంచి మహారాష్ట్రలోని సిర్వంచ వైపు వెళ్తున్న బొలేరో వాహనం బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రావణ్ కాలుకి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు


గాయపడిన మమత

నెన్నెల: మండల కేంద్రంలో ఓ పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని జాపతివాడలోని దురిశెట్టి మమత, కుమ్మరి మధునక్క దుకాణానికి వెళ్లి వస్తుండగా రోడ్డు పక్క నుంచి ఒక్కసారిగా వచ్చిన పిచ్చికుక్క ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. గమనించిన గ్రామస్తులు పిచ్చికుక్కను కట్టెలతో కొట్టి చంపారు. అనంతరం నెన్నెల పీహెచ్‌సీలో గాయపడిన వారికి చికిత్స అందించారు. దీంతో గ్రామంలో ప్రజలు, విద్యార్థులు బయటకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. చర్మవ్యాధులతో చర్మం ఊడిపోయి గ్రామంలో తిరుగుతున్న వీధి కుక్కలు ఎండలకు శరీరం మంటకు గురికావడంతో పిచ్చెక్కి దాడులకు పాల్పడుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వీధి కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


అజయ్ మృతదేహం

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొడు గూడకు చెందిన కుర్సింగ అజయ్(18) మానసిక పరిస్థితి సరిగ్గా లేక చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... చొడుగూడకు చెందిన అజయ్ గతంలో రెండు, మూడు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. మంగళవారం ఉదయం మేకలు కాయడానికి వెళ్లి మధ్యాహ్నం 12గంటలకు మేకలను తన ఇంటి వద్ద వదిలిపెట్టి ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం తెల్లవారు జామున 6.30 గంటల సమయంలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

రెబ్బెన: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై బుధవారం ట్రాక్టర్ ఢీకొని గోలేటి విలేజ్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లావుడ్య శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. శంకర్ తన ద్విచక్ర వాహనంపై కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వైపు నుంచి రెబ్బెన వైపు వస్తుండగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఉపాధ్యాయుడి ఎడమ కాలు, ఎడమ చేతికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది హుటాహుటిన క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో మంచిర్యాలకు తరలించారు.

నేడు బీఆర్‌ఎస్ ఎన్నికల సమావేశం

బెల్లంపల్లి: పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని గురువారం బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎన్నికల సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. పెద్దపల్లి పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ హాజరు కానున్నారని తెలిపారు. బెల్లంపల్లి తిరుమల హిల్స్‌లోని తన స్వగృహంలో సమావేశం జరుగుతుందని, బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని మండలాల బీఆర్‌ఎస్ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

రూ.16లక్షలు వృథా..

- అధికారుల అవగాహన లోపం
- నిరుపయోగంగా మారిన వైనం



చెన్నూర్ మున్సిపాలిటీలో మూలనపడిన వైకుంఠ వాహనం

చెన్నూర్: ప్రజా ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని చెన్నూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన వైకుంఠ వాహనం నిరుపయోగంగా మారింది. రూ.16 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనం ప్రజలకు ఉపయోగపడకుండా మారడంతో కార్యాలయంలో మూలనపడేశారు. అధికారుల అవగాహన లోపం కారణంగా ప్రజాధనం వృథా అయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చెన్నూర్ మున్సిపాలిటీలో..

చెన్నూర్ మున్సిపాలిటీలో ప్రజలు దహన సంస్కారాలను సమీపం గోదావరి నదిలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గోదావరినదిలో దహన సంస్కారాలకు నడిచి వెళ్లడం ప్రజలకు కష్టంగా మారింది. ప్రైవేట్ వాహనాలు సమయానికి లభించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ పాలకవర్గం వైకుంఠ వాహనం కొనుగోలు చేయాలని తీర్మానం చేసింది. గోదావరి నది వరకు వెళ్లాలంటే ఫోర్ వీల్లర్ వాహనం అవసరం ఉండగా అధికారులు త్రీవీల్లర్ వాహనాన్ని కొనుగోలు చేశారు. మున్సిపాలిటీ అధికారులు కొనుగోలు చేసిన వాహనం ప్రజల అవసరాలకు పనికి రాకుండా పోయింది. ప్రజలు ఎవరైనా వాహనాన్ని తీసుకొని వెళ్లినా గోదావరి నదిలో నడవాల్సిన దుస్థితి నెలకొంది. వాహనానికి డబ్బులు చెల్లించి ఫలితం లేకుండా పోవడంతో మున్సిపాలిటీ వాహనం వాడకాన్ని బంద్ చేశారు. దీంతో వైకుంఠ వాహనం మూలన పడేశారు. అధికారులు అనలోచిత చర్యలతో లక్షలాది రూపాయలు వృథా అయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఫోర్ వీల్లర్ సౌకర్యం గల వాహనాన్ని కొనుగోలు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

వాడకం తక్కువగా ఉంది..

ప్రజలు ఎవరైనా అవసరం ఉందంటే పంపిస్తున్నాం. వాహనంలో ఫోర్ వీల్లర్ సౌకర్యం లేదు. కొనుగోలు విషయంలో గోదావరి నదిలో వెళ్లాల్సి ఉంటుందనే విషయం నా దృష్టికి రాలేదు. దీంతో ఫోర్ వీల్లర్ సౌకర్యం లేకుండా కొనుగోలు చేయాల్సి వచ్చింది.

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్, చెన్నూర్

110 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- అటవి చెక్‌పోస్టు దాటుకుని పోలీసులకు చిక్కిన వైనం
- ఏడుగురిపై కేసు నమోదు



పట్టుకున్న బియ్యం వ్యానుతో ఎస్సై, పోలీసులు

జన్నారం: కొంతకాలంగా కళ్లు కప్పి తరలిస్తున్న రేషన్ బియ్యం రవాణకు పోలీసులు 'చెక్' పెట్టారు. దారిలో అటవి చెక్‌పోస్టును దాటుకుని జన్నారం గుండా రేషన్ బియ్యం తరలిస్తున్న ఐచర్ వ్యాను పట్టుకున్నారు. బుధవారం ఎస్సై సతీశ్ వివరాలు వెల్లడించాడు. దండేపల్లి మండలం నెల్కి వెంకటపూర్ గ్రామానికి చెందిన శ్రవణ్ 110 క్వింటాళ్ల ఐచర్ వ్యాన్‌లో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి చెందిన సంతోష్ అనే వ్యాపారి వద్దకు తరలిస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామునా పోలీసులకు సమాచారం అందించడంతో ఉదయం 4గంటల ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ సమీపంలో మాటువేశారు. దండేపల్లి వైపు నుంచి ముందు ఒక కారు, తర్వాత ఐచర్ వ్యాను వెనుకాల మరో కియా కారు వస్తుండగా ముందు కారు పోలీసులను చూసి వెళ్లిపోగా ఐచర్ వ్యానును ఆపి తనిఖీ చేశారు. అందులో బియ్యం, వెనుక ఉన్న కారు ఎస్కార్టుగా గమనించిన ఎస్సై సతీశ్ బియ్యంతో ఉన్న ఐచర్ వ్యాను, కారును అదుపులోకి తీసుకున్నారు. సివిల్ సప్లాయ్ అధికారులకు సమచారం అందించగా రాకపోవడంతో ఈ సంఘటనలో నెల్కి వెంకటపూర్‌కు చెందిన శ్రావణ్, నితీష్‌గుప్తా, వ్యాపారి సంతోష్, ఐచర్ వ్యాన్ డ్రైవర్ అజిత్‌లతో పాటుగా మరో ముగ్గురు కూలీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

చెక్‌పోస్టు ఎలా దాటింది..

టైగర్‌జోన్ నిబంధనల ప్రకారం సాయంత్రం 9గంటల నుంచి ఉదయం 6గంటల వరకు టైగర్‌జోన్ పరిధిలోని బఫర్ ఏరియాలో వాహనాల రాకపోకలకు అనుమతి లేదు. భారీ వాహనాలకు అసలే అనుమతి లేదు. ఈ నిబంధనలకు అటవి అధికారులు నీళ్లు వదిలినట్లు తెలుస్తోంది. బుధవారం రాత్రి 3గంటల తర్వాత బియ్యం తరలిస్తున్న ఐచర్ వ్యాను ఎలా అనుమతి ఇచ్చారనేది అనుమానాలకు తావిస్తోంది. నిత్యం అక్రమ రవాణా చేసే వాహనాల నుంచి ఎంతోకొంత తీసుకుని వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటనతో ఆ ఆరోపణలు నిజమని తెలుస్తుంది. ఈ విషయంలో సంబంధిత అటవి అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

క్రమశిక్షణతో పని చేయాలి

- జీఎం సంజీవరెడ్డి
- కారుణ్య నియామక పత్రాలు అందజేత

శ్రీరాంపూర్: కంపెనీలో కొత్తగా చేరుతున్న ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేసి మంచి గుర్తింపు పొందాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలో 13మంది యువతీ, యువకులకు కారుణ్య నియామక ఉద్యోగ పత్రాలను అందించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగంలో చేరడం అదృష్టంగా భావించాలన్నారు. ఈ ఉద్యోగం రావడానికి కారణమైన తండ్రులు, మామలకు వృద్ధాప్యంలో మంచిగా సేవచేయాలన్నారు. రక్షణతో పనిచేసి సంస్థ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలన్నారు. శ్రీరాంపూర్‌లో ఇప్పటివరకు 3,586 మందికి కారుణ్య నియామక పత్రాలను ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌ఓటూ జీఎం పురుషోత్తం రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, ఏఐటీయూసీ నాయకులు ఉన్నారు.

నీవు లేక నేనుండలేను..!

- ఉరేసుకుని ప్రియురాలి ఆత్మహత్య
- విషయం తెలిసి పురుగుల మందు తాగిన ప్రియుడు
- వేర్వేరుగా ప్రేమికుల బలవన్మరణం


తీగుళ్ల భగవాన్(ఫైల్)


నాంపల్లి సంగీత(ఫైల్)

నెన్నెల/మందమర్రిరూరల్: మనసులు ఏకమయ్యాయి.. కలకాలం కలిసి బతకాలని ఎన్నో కలలు కన్నాం.. నాకు నువ్వు.. నీకు నేను తోడుగా కొత్త జీవితం ప్రారంభించాలనుకున్నాం.. కానీ నీ అకాల మరణం నన్ను ఒంటరిని చేసింది.. నువ్వు లేని లోకంలో నేనుండలేను.. నీ వెంటే నేనొస్తున్నా అంటూ ప్రియురాలి ఎడబాటును తట్టుకోలేక ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వేర్వేరు గ్రామాల్లో ఒకే రోజు ప్రేమికులు ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన మంచిర్యాలలో జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన తీగుళ్ల భగవాన్(24), మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన నాంపల్లి సంగీత (23) వరుసకు బావమరదలు అవుతారు. వీరిద్దరూ ఐదేళ్లుగా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. కాగా, మామిడిగట్టు గ్రామంలోని నాంపల్లి గంగ, ఓదెలు దంపతులకు కూతుళ్లు సంధ్య, సంగీత, రోజా ఉన్నారు. సంధ్యకు పెళ్లి కాగా భర్తతో కలిసి దహెగాంలో ఉంటోంది. వీరి కుమారుడు విహాన్ష్ మామిడిగట్టు గ్రామంలోని అమ్మమ్మ గంగ ఇంట్లో ఉంటున్నాడు. బుధవారం అతడికి టిఫిన్ పెట్టే విషయంలో సంగీత మందలించింది. దీంతో సంగీతను తల్లి గంగ మందలించి ఉపాధి కూలీ పనికి వెళ్లింది. కాసేపటికి పక్కింట్లోనే ఉండే సంగీత పెద్దమ్మ గౌరి విహాన్ష్‌ను తీసుకుని కాసిపేటలోని తన కూతురును తీసుకు రావడానికి వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తలుపు గడియ వేసి ఉంది. సంగీత దూలానికి ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. కాగా, సంగీతకు ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తుండగా ప్రేమ విషయం తెలిసి ఘర్షణ జరిగి ఉంటుందని, కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు. రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విషయం తెలిసి..

భగవాన్ డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తుండగా పత్తిని తాండూర్ మండలం రేపల్లెవాడ జిన్నింగ్ మిల్లులో అన్‌లోడ్ చేయడానికి తీసుకెళ్లాడు. తిరిగి వస్తుండగా బెల్లంపల్లి మండలం దుగినెపల్లి వరకు రాగానే సంగీత ఆత్మహత్య విషయం తెలిసింది. ప్రియురాలు లేని జీవితం వ్యర్థమని భావించి సమీపంలో ఉన్న మామిడి తోటలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. భగవాన్ సోదరుడు భరత్ అతడికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. లొకేషన్ ఆధారంగా అక్కడికి చేరుకోగా అప్పటికే మృతిచెందాడు. తాళ్లగురిజాల పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి సోదరుడు భరత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేష్ తెలిపారు. ఇద్దరి మృతితో చిత్తాపూర్, మామిడిగట్టు గ్రామాల్లో విషాదం నెలకొంది.

తెగిన విద్యుత్ తీగ... నిలిచిన రైళ్ల రాకపోకలు


విద్యుత్ తీగ మరమ్మతు చేస్తున్న రైల్వే సిబ్బంది

మందమర్రిరూరల్: మందమర్రి రైల్వే స్టేషన్ సమీపంలో నార్లపూర్ గేటు వద్ద విద్యుత్ తీగ తెగిపోవడంతో పలు రైళ్లు నాలుగైదు గంటలు ఆలస్యంగా నడిచాయి. దీంతో పలు రైల్వే స్టేషన్లలోని ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వివరాల ప్రకారం ... బుధవారం తెల్లవారు సమయంలో ఒంటిగంట సమయంలో కాజీపేట వైపు వెళ్లే (డౌన్) రైలు ఆంటీనాలో సాంకేతిక లోపంతో ఓహెచ్‌ఈ వైర్ తెగిపోయింది. దీంతో రైలుకు సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో వెంటనే అప్రమత్తమైన రైల్వే సాంకేతిక సిబ్బంది ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చర్యలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా సికింద్రాబాద్ నుంచి వచ్చిన సిబ్బంది తెగిపోయిన తీగను సరిచేయడానికి నాలుగైదు గంటలు శ్రమించాల్సి వచ్చింది.

హ్యాట్సప్ పోలీస్..

- పరీక్ష రాస్తుండగా ఫిట్స్‌తో పడిపోయిన విద్యార్థిని
- పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించిన ఎస్సై


వాహనంలో ఎక్కిస్తున్న ఎస్సై, పాఠశాల సిబ్బంది

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో మోడల్ స్కూల్‌లో ఇంటర్ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తుండగా ఓ విద్యార్థిని అనారోగ్యానికి గురైంది. పరీక్ష కేంద్రం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై రాములు తన పోలీస్ వాహనంలో ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకుని విద్యార్థిని నిండు ప్రాణాలు కాపాడారు. ఎస్సై రాములు వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్ పరీక్షలు రాసేందుకు మిమ్స్ జూనియర్ కాలేజీకి చెందిన ప్రోనిత రవింద్ర అనే విద్యార్థిని పరీక్షలు రాసేందుకు పరీక్ష కేంద్రానికి వెళ్లింది. పరీక్ష రాస్తుంగా ఫిట్స్ రావడంతో కిందపడిపోయింది. మోడల స్కూల్ సిబ్బంది ప్రోణితను బయటకు తీసుకురావడంతో వెంటనే ఎస్సై రాములు తన వాహనంలోకి స్వయంగా ఎక్కించుకొని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకొని విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. దీంతో ఎస్సైని, సిబ్బందిని సీపీ శ్రీనివాసులు అభినందించారు.

మహిళా కౌలురైతు ఆత్మహత్య

ఆసిఫాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి మహిళా కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మండలంలోని గూడెన్‌ఘట్ గ్రామానికి చెందిన సత్రవేణి సుమలత(30), భర్త రాజ్‌కుమార్ కొన్నేళ్లుగా భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఇటీవల పత్తి పంటలో తీవ్ర నష్టం వచ్చింది. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని భార్యభర్తలు మదనపడేవారు. అప్పులు తీర్చే మార్గం లేక మంగళవారం రాత్రి 12గంటలకు పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతురాలుకు భర్త రాజ్‌కుమార్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుడుంబా పట్టివేత

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో 30 లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సంజయ్ తెలిపారు. గ్రామంలో ఒకరి ఇంటిలో గుడుంబా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన 30లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న, సిబ్బంది శ్రీను, రాజు, తిరుపతి, చెన్నూర్ బ్లూకోల్ట్ మల్లేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జైపూర్: మండలంలోని రసూల్‌పల్లి పెద్దవాగు నుంచి బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ బాలు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యం

కోటపల్లి: ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యమని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని ఆన్నారం గ్రామంలో ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఐ సుధాకర్ 30మంది పోలీసులతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేరాల నిర్మూలనకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాజేందర్, పోలీసులు పాల్గొన్నారు.

రాకపోకలపై వైల్డ్‌లైఫ్ వార్డెన్‌కు వినతి

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం గుండా వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని వైల్డ్‌లైఫ్ వార్డెన్ మోహన్ చంద్ర ప్రగేయిన్‌కు స్థానిక వ్యాపారులు, నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. జన్నారం అటవీ డివిజన్‌లోని అభివృద్ధి పనుల పరిశీలనకు వచ్చిన ఆయనను కలిశారు. జన్నారం మీదుగా టైగర్‌జోన్ పేరుతో రాకపోకలు నిలిపివేయడంతో అభివృద్ధి కుంటుపడుతోందని పేర్కొన్నారు. లారీలు, భారీ వాహనాలు జగిత్యాల మీదుగా వెళ్లడంతో ఇక్కడ వ్యాపారం తగ్గిపోయిందని తెలిపారు. హోటళ్లు మూసుకునే పరిస్థితి ఏర్పడిందని, అటవీ అధికారులు చొరవ తీసుకుని వాహనాల రాకపోకలకు నిబంధనలు సడలించాలని కోరారు. నాయకులు కొండపల్లి మహేశ్, ఓంకారేశ్వర్, భూమాచారి, సందీప్, రాజేశ్వర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో భద్రతా చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న నాగపూర్ ఐజీ చెర్రింగ్ దోర్జే

- నాగపూర్ ఐజీ చెర్రింగ్ డోర్జే

ఆసిఫాబాద్: అంతర్రాష్ట్ర సరిహద్దులో భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని నాగపూర్ ఐజీ చెర్రింగ్ దోర్జే అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల సమన్వయం కోసం ప్రత్యేక సరిహద్దు సమావేశం గురువారం మహారాష్ట్రలోని చంద్రపూర్ ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, చంద్రపూర్ ఎస్పీ ఎం.సుదర్శన్, కలెక్టర్ వినయ్ గోద్వ, యవత్మాల్ ఎస్పీ పవన్‌దన్‌సూద్, ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ దాసరి వేణుతో పాటు ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ సరిహద్దుల్లో అవినీతి అక్రమాలు నియంత్రించాలన్నారు. సరిహద్దుల వద్ద పటిష్ట భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆసిఫాబాద్, చంద్రపూర్ జిల్లాల్లో భద్రతా చర్యలను ఎస్పీలు పరస్పరం ముచ్చటించుకున్నారు. డీఎస్పీ సదయ్య, టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, వాంకిడి సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూడోలైన్ పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న రైల్వే సేఫ్టీ కమిషనర్

రెబ్బెన(ఆసిఫాబాద్): కాజీపేట్ నుంచి బల్లార్షా వరకు చేపడుతున్న మూడోలైన్ నిర్మాణ పనుల్లో భాగంగా రెబ్బెన మండలంలోని ఆసిఫాబాద్‌రోడ్ రైల్వే స్టేషన్ నుండి మంచిర్యాల జిల్లా రేచినిరోడ్ రైల్వే స్టేషన్ వరకు పూర్తయిన పనులను బుధవారం రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి పరిశీలించారు. నూతనంగా నిర్మించిన బ్రిడ్జీలు, కల్వర్టులను తనిఖీ చేశారు. అనంతరం డిజిల్ లోకోలో ప్రయాణించి 3వ లైన్ సామర్థ్యాన్ని పరిశీలించారు.

రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని వినతి

రెబ్బెన మండల కేంద్రంలో ఉన్న ఆసిఫాబాద్ రోడ్డు రైల్వే స్టేషన్‌లో కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఇతర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని మండలానికి చెందిన నాయకులు ఆమెకు వినతిపత్రం అందజేశారు.

తీరం వెంట డ్రోన్ పెట్రోలింగ్


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్

వేమనపల్లి: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్న ప్రాణహిత తీరం వెంట డ్రోన్ కెమెరాల నిఘా నిరంతరం ఉంటుందని చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. బుధవారం ప్రత్యేక పోలీసు సిబ్బంది, నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్‌తో కలిసి పోలీస్‌స్టేషన్ ఆవరణలో డ్రోన్ పెట్రోలింగ్ నిర్వహించారు. తీరం అవతలి వైపు ఉన్న మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిరోంచ, అహెరి తాలూకాల నుంచి నిత్యం రాకపోకలు ఉంటాయన్నారు. అనుమానిత వ్యక్తులు నది దాటి వచ్చే అవకాశముందని, ముందస్తు డ్రోన్ పెట్రోలింగ్ చేపడుతున్నామని, డ్రోన్ పనితీరును ఎన్ని కిలోమీటర్ల మేర నిఘా ఏర్పాటు చేయవచ్చనే విషయాలు తెలుసుకున్నారు.

కమ్యూనిటీ కాంటాక్ట్

సుంపుటం గ్రామపంచాయతీ కేంద్రంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. వాహనపత్రాలు లేని బైక్‌లను సీజ్ చేశారు. అనుమానిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వవద్దని రూరల్ సీఐ సుధాకర్ సూచించారు. ఎస్సై శ్యాంపటేల్, పోలీసులు పాల్గొన్నారు.

వసతి గృహ సంక్షేమాధికారుల కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ, బిసి వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఎన్నుకున్నారు. వసతి గృహ సంక్షేమాధికారుల కేంద్ర సంఘం అధ్యక్షుడు గౌస్ హష్మీ, కార్యదర్శి మాధవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా మొహిసిన్ అహ్మద్, సెక్రెటరీగా కోరుట్ల శ్రీనివాస్, కోశాధికారిగా నల్లెల్లి మల్లేశ్, అసోసియేట్ అధ్యక్షుడిగా బొడ్డు శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షులుగా సుదాలక్ష్మీ, సంయుక్త కార్యదర్శులుగా విజయలక్ష్మీ, సరిత, పబ్లిసిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా నూర్జాహాన్, సునీత, కార్యవర్గ సభ్యులుగా రమేశ్, సుభద్ర ఎన్నికయ్యారు.

కోరం లేక ఎన్నిక వాయిదా

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక బుధవారం నిర్వహించాల్సి ఉండగా కోరంలేక వాయిదా పడింది. నామినేషన్లు వేసేందుకు డైరెక్టర్లు ఎవరూ రాకపోవడంతో గురువారానికి వాయిదా వేస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి జే.నర్సయ్య తెలిపారు. గురువారం నిర్వహించే ఎన్నికకు నిర్ణీత సమయానికి డైరెక్టర్లు హాజరు కావాలని పేర్కొన్నారు.